కథ

# చినుకు రాలితే....

- భమిడి వేంకటేశ్వర్లు

ఆదివారం ఉదయం పదకొండు గంటల సమయం. టి.విలో ఏదో ప్రోగ్రాం ఆసక్తిగా చూస్తున్నాడు శ్రీరావు. ప్రోగ్రాం వెరైటీగా, చక్కగా వుంది. అప్పుడు ఫోను మోగింది. అతనికి చిరాకు, కోపం పెరిగిపోయింది. అప్పుడు ప్రకటనల నిమిత్తం "బ్రేక్" పడింది. కాబట్టీ ఫోను అందుకున్నాడు శ్రీరావు.

"హలో" అంటూ మాట్లాడేడు.

అవతల ఆడగొంతు. పైగా "అనసూయమ్మది" అని గ్రహించాడు అతను. ఫోను పెట్టేయాలనుకున్నాడు. కాని సభ్యతను కాసేపు గౌరవిస్తూ "ఏమిటి సంగతి?" అంటూ క్లుప్తంగా అడిగాడు - చిరాగ్గా.

అనసూయమ్మ ఏదో చెప్పబోయింది.

అంతలో టి.వీలో ప్రకటనలు ముగిసాయి. కార్యక్రమం మొదలైంది. శ్రీరావు దృష్టి టి.వీ మీదకు మళ్ళింది. "అరగంట తరువాత ఫోను చేయండి" అంటూ ఫోను పెట్టేసాడు శ్రీరావు నిర్లక్ష్యంగా.

అనసూయమ్మకు అహం దెబ్బతింది.

"ఫోను మధ్యలో కట్ చేస్తాడా ఆ రాస్కెల్.... స్కౌండ్రల్... స్టుపిడ్..." స్వగతంలోనే తిట్టుకుంది. అలా తిట్టుకొనేందుకు ఆవిడకు బోలెడు స్తోమత వుందనుకుంటుందావిడ. తను ఎదురు చెప్పగలదు, కాని ప్రస్తుత పరిస్థితి వేరు. అందుకు శ్రీరావుని ఉపయోగించుకోవాలి. అందుకే నోటికి తాళం వేసుకుంది అనసూయమ్మ.

నిజానికి శ్రీరావు ఆలోచనలు ఆవిడమీదే! ఈ మహాతల్లి శ్రీకాకుళం నుంచి ఎప్పుడు దిగిందో! ఈ రెండేళ్ళలో ఆవిడ నగరానికి ఏడెనిమిదిసార్లు వచ్చినట్లుగా తనకు తెలిసింది. ఆవిడ కర్టెసీగానైనా రాలేదు. కనీసం ఫోను కూడా చేయలేదు. అందుకే కోపం!

టి.వి ప్రోగ్రాం అయిపోగానే ఫోను మోగింది. అప్పుడు ఫోను అందుకున్నాడు శ్రీరావు "ఏమిటి సంగతి?" అంటూ.

"ఫోను పెట్టేయడం బాగోలేదు" అందావిడ.

"సరేలెండీ, విషయం చెప్పండి...."

అనసూయమ్మ అతని గొంతులోని నిర్లక్ష్యం గ్రహించింది. "నేను, మా ఆయన ప్రొద్దున్న శ్రీకాకుళం నుంచి వచ్చాం. మా యింట్లోనేవున్నాం. మీరోసారి మాయింటికి రావాలి" - అందావిడ.

"మీ యింటికా ... నేనా... అంతదూరమా.... అందులో యీవేళ ఆదివారం కదా... టీ.వీ ప్రోగ్రాములు మిస్సవడం నాకిష్టం లేదు.... మీరే వీలుచూసుకుని మా యింటికి రండి" అన్నాడు శ్రీరావు.

తమని పట్టించుకోవడం లేదనిపించింది అనసూయమ్మకి ఆవిడకు వసుదేవుడు గుర్తుకొచ్చాడు. అవసరం ఏమది.

"విషయం చెప్పకుండానే" అంటూ ఏదో చెప్పబోయాడు శ్రీరావు.

అనసూయమ్మకు నగరంలో బంధుబలం బాగానే వుంది. తమ్ముళ్ళు, తండ్రి, చెల్లెళ్ళు, వియ్యాలవారు, తోడికోడళ్ళు వెరసి బంధువులు ముప్పయ్ మంది దాకా వుంటారు. ఆవిడది "లాభం - కట్టుబాటు" ఫార్ములా. అవసరం వరకే ఎవరైనా - అనే ప్రిన్సిపుల్ ఆవిడకే సొంతం... సొంతం !

"ఏదో టైమ్‌లో రండి సాయంత్రం లోపుగా" - అనక తప్పలేదు అనసూయమ్మకు.

"ఇంతకీ విషయం ఏమిటి" ఆత్రంగా అడిగాడు.

> ఆవిడ కళ్ళల్లో నీళ్ళు తిరగడం శ్రీరావు గమనిస్తూనే వున్నాడు. కొడుకులకు చెప్పలేదుట, బంధువులకు తెలియకూడదట! ఇదేం ఆలోచన యీవిడది!! ఎవరికి చెప్పుకోలేని పరిస్థితిలో అనసూయమ్మ ఎందుకుంది?

"మా వారికి ఒంట్లో బాగుండటం లేదు. ఎల్లాగో శ్రీకాకుళం నుంచి యిక్కడకు తీసుకొచ్చాం కాబట్టి మీరు రావాలి" అందావిడ.

"అయితే నేనొచ్చి ఏం చేయాలి? మీ వాళ్ళు వున్నారుగా. పైగా మీకు ఆరుగురు కొడుకులున్నారు. వాళ్ళు గొప్పవాళ్ళు, మేధావులు, చదువుకున్నవాళ్ళు, అన్నింటికి మించి సంపాదనాపరులు...." అన్నాడు శ్రీరావు.

"అవన్నీ అనవసరపు మాటలు. మీకు ఫోను చేసాను. మీరొస్తారని ! ఈ విషయం మీకే చెప్పాను. ఎవరికీ చెప్పడం నాకిష్టం లేదు" అంటూ ఫోను పెట్టేసింది అనసూయమ్మ.

టీ.వీ వైపే చూస్తుండిపోయాడు శ్రీరావు.

☆ ☆ ☆

"అనసూయమ్మ మొగుడు పాపారావు. పదిహేనేళ్ళ క్రితం వరకు నగరంలోనే రెవెన్యూ డిపార్టు మెంటులో ఉద్యోగం. అతని సర్వీసులో తుఫానులు, వరదలు, కరువులు బాగా రావడంతో సంపాదన, ఆదాయం పెరిగింది. ప్రజలకు పంచవలసిన నిధుల్ని తను బాగా నొక్కేయుడంతో బ్యాంకు నిలవలు పెరిగిపోయేవి! ఇతరుల డబ్బుపట్ల అతనికి గొప్ప వ్యామోహం. తన డబ్బు దాచుకోవాలని, ఇతరులచే ఖర్చు పెట్టించాలనే ఫిలాసఫీ !

"చూస్తే నీది - చూడకపోతే నాది" అనే సామెత అతని పాకెట్లో ఎప్పుడు వుంటుంది.

పొదుగు కోసైనా పాలు పిండుకోవాలనే మనస్తత్వం ! తను దర్జాగా, హాయిగా, ఆనందంగా వుండాలనే వుబలాటం! "ఇస్తావా... తెస్తావా?" అని ప్రశ్నించే రకం.

కాబట్టే పాపారావులో అహంకారం ఎక్కువ. సంపాదన పెరగటంతో మందు, పేకాటలాంటి హాబీలు పెరిగాయి. ఇదంతా గమనించిన మావగారు గుట్టుగా శ్రీకాకుళం ట్రాన్స్‌ఫర్ చేయించాడు, కొంత ఖర్చుపెట్టి!

క్రమంగా పాపారావులోని కొన్ని వ్యాధులు బయటకు తెలిసాయి. ఫలితంగా మందులు, ఆసుపత్రులు, డాక్టర్లు!

నిజానికి పాపారావుకీ, శ్రీరావుకి చుట్టరికం లేదు. కేవలం కలసి చదువుకోవడం వరకే ! ఇద్దరివీ వేరువేరు ఉద్యోగాలు. అన్నింటికీ మించి శ్రీరావు చేతుల మీదుగా పాపారావు యిల్లు రూపుదిద్దుకుంది. కొన్ని విషయాల్లో సలహాదారు కూడా !

ఇదంతా పుష్కరంనాటి ముచ్చట !

కొన్ని సందర్భాలలో శ్రీరావు గురించిన విమర్శలు పాపారావు చేసాడు. "నా యింటికి అంతఖర్చు అవదు, శ్రీరావు కొంత పట్టేసాడు. అందుకే స్కూటర్ కొనగలిగేడు" అంటూ.

"అది నిజం కాకపోతే డబ్బు ఎందుకుకిచ్చినట్టు?" అన్నాడు పాపారావు.

"నిజం మీలాంటి వారి నైజం కాదు కాబట్టి" పాపారావులో అహం పెరిగింది. మాటలు నోటిని దాటాయి. కళ్ళు ఎరుపెక్కాయి.

"తుఫాను, వరదలు,కరువులు రావాలని కోరుకునే వారి ఆలోచనలు యిలా వుంటాయని తెలిసింది" శ్రీరావుకీ కోపం వచ్చింది.

"ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా! నా లెవలు, స్టేటస్సు, బ్యాంకు బ్యాలెన్సూ నీకు తెలుసా! పైగా ఆరుగురు కొడుకులను పుట్టించాను." వీరంగం ప్రదర్శించాడు పాపారావు.

"తెలుసునాకు! ఇద్దరు కొడుకులు తమతో తెగతెంపులు చేసుకున్నారనీ... కోడలు చేయి

పట్టుకున్నందుకు తమరు చెంపదెబ్బ తిన్నట్టూ - కూడా తెలుసు" శ్రీరావు అనేసాడు.

అంతే వారి మధ్య విరోధానికి ఆరంభం ! పదిహేను రోజుల తరువాత అనసూయమ్మ శ్రీరావుని కలిసింది. "అయిందేదో అయిపోయింది... ఎప్పట్లాగానే ఉందాం. అంతా మరిచిపోదాం" అంటూ లౌక్యంగా చెప్పింది.

పగిలిన గ్లాసు, విరిగిన మనసు అతుకుపడదు" అన్నాడు శ్రీరావు చిరాగ్గా.

ఆరు నెలల తరువాత అనసూయమ్మ శ్రీరావు ఇంటికి వెళ్ళి " మా అమ్మాయి పెళ్ళి" - అంటూ శుభలేఖ యిచ్చింది.

శ్రీరావు శుభలేఖ చూడకుండా పక్కన పడేసాడు. 'శుభం' అంటూ.

"మీరు తప్పకుండా రావాలి" అని ఆవిడ అనలేదు. అప్పటినుంచి వాళ్ళు ఎవరికి వారే అన్నట్లు మిగిలారు. పాపారావు శ్రీకాకుళం బదిలీ కూడా ఎవరి ద్వారానో శ్రీరావుకి తెలిసింది.

☆ ☆ ☆

పాపారావు యింటికి కొంచెం దూరంలో నిలబడ్డాడు శ్రీరావు. ఏవో ఆలోచనలు ! తను అనవసరంగా వచ్చాడా! తనని దారుణంగా అవమానించిన వ్యక్తి యింటికి వెళ్ళాలా! అతని గురించి తనకెందుకు!

"ఎందుకు వెళ్ళడం... హాయిగా టీవీ చూడండి" అంటూ భార్యామణి సలహా యిచ్చింది.

"ఊరికే చూసొస్తాను" - అన్నాడు తను.

"జాగ్రత్త... మరీ అంత క్లోజుగా వెళ్ళకండి. అతనిలో ఏ దిక్కుమాలిన రోగమో?" - అని పంపింది తను.

అనసూయమ్మ గుమ్మంలోనే కనిపించింది 'రండి' - అంటూ ఆప్యాయతను ఒలకబోసింది.

**"ఫోను మధ్యలో కట్ చేస్తాడా ఆ రాస్కెల్.... స్కౌండ్రల్... స్టుపిడ్..." స్వగతంలోనే తిట్టుకుంది. అలా తిట్టుకొనేందుకు ఆవిడకు బోలెడు స్తోమత వుందనుకుంటుందావిడ. తను ఎదురు చెప్పగలదు, కాని ప్రస్తుత పరిస్థితి వేరు.**

శ్రీరావులో ఆశ్చర్యం !

పాపారావు మంచం మీద అచేతనంగా పడుకున్నాడు. "ఏమిటి... ఏమైంది" శ్రీరావు బాధగా అడిగాడు.

"ఎనిమిది నెలల్నుంచీ యిదీ పరిస్థితి. మందులు, డాక్టర్లూ మామూలే... పైగా డబ్బు ఖర్చు."

"ఇంతకీ డాక్టర్లు ఏం వ్యాధి అన్నారు?"

" కేన్సర్. "

శ్రీరావు ఖంగు తిన్నాడు. "ఇంతకీ యీ స్థితిలో శ్రీకాకుళం నుంచి ఎలా తీసుకొచ్చారు - మీరొక్కరే !" అడిగాడు అతను.

"ఆఫీసులో యిద్దరు అటెండర్లు కూడా వచ్చేరు తిరిగి పన్నెండు గంటల రైలులో వెళ్ళిపోయారు వాళ్ళు" అనసూయమ్మ చెబుతోంది.

"అతన్ని చూస్తుంటే మీకేమనిపిస్తోంది" అని అడగాలనుకున్నాడు శ్రీరావు.

అతనికి భార్యమాటలు గుర్తుకొచ్చాయి.

అంతలోనే పాపారావు ప్రవర్తన గుర్తుకొచ్చింది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగింది అనసూయమ్మ చెమరింపు కళ్ళను దాచుకుంటూ...

"ఏం లేదు.......... పాపారావుకి నేను ఎలా సాయపడాలాని! అతనికి సాయం చేసే లెవెలు, యోగ్యత, అర్హత నాకున్నాయాని !"

అనసూయమ్మ ఆలోచనలో పడింది.

"మీ కొడుకులకు చెప్పారా? అన్నట్టు మీ అల్లుడుకూడా డాక్టరే కదా! ఓసారి చెప్పి తీసుకుని వెళ్ళవలసింది! అల్లుడు డాక్టరు కాబట్టి జాగ్రత్తగా చూస్తారు మిగిలిన డాక్టర్లు!"

శ్రీరావు ధోరణి వాస్తవంగా కనిపించలేదు ఆవిడకి వెటకారంగా తోస్తోంది.

"కనీసం పాపారావు గురించి యిక్కడికైనా వచ్చారు కాబట్టి - మీ వాళ్ళకు చెప్పండి !" సలహా యిచ్చాడు శ్రీరావు.

"ఎవరికి చెప్పదలచుకోలేదు. మీకు తెలిసిన డాక్టర్లు, కేన్సరు ఆసుపత్రిలో ఉన్నారని తెలుసు. పైగా మీ ద్వారా ఓ ముగ్గురుని చూపించారని తెలుసు. అందుకే మీతో చెప్పాను" అంది అనసూయమ్మ దీనంగా.

ఆవిడ కళ్ళల్లో నీళ్ళు తిరగడం శ్రీరావు గమనిస్తూనే వున్నాడు. కొడుకులకు చెప్పలేదుట, బంధువులకు తెలియకూడదట! ఇదేం ఆలోచన యీవిడది!! ఎవరికి చెప్పుకోలేని పరిస్థితిలో అనసూయమ్మ ఎందుకుంది?

శ్రీరావుని ఆలోచనలు వెంటాడుతున్నాయి.

మనిషికి మనిషి తోడు, సాయం కావాలి! ఏ సమయంలో ఎవరికి ఎటువంటి పరిస్థితి ఎదురవుతుందో! తన మీద నమ్మకం వుంచుకుని ఫోను చేసింది అనసూయమ్మ. తను టి.వి పిచ్చిలోపడి ఫోన్లు కట్ చేసేసాడు మూర్ఖంగా! తెలివి తక్కువగా!

తనకంటే అనసూయమ్మే నయమేమో!

"రేపు ఎనిమిది గంటలకు నేను వస్తాను. పాపారావుని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తాను" అంటూ వెళ్ళిపోయాడు శ్రీరావు.

శ్రీరావులాంటి వారిలోని వ్యక్తిత్వాన్ని గుర్తించని వారు - తమ భేషజాన్ని, అహంకారాన్ని, గొప్పతనాన్ని ప్రదర్శించుకుంటూ, ఓటమి దిశగా నడుస్తుంటారేమో!

☆ ☆ ☆

*సంక్రాంతి -2005 సందర్భంగా కార్యాలయ స్థాయిలో నిర్వహించిన కథలపోటీలో బహుమతి పొందిన కథ.*

## సునామీ



- శ్యాం విజయ్